# భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

## అధ్యయన బృందం నివేదిక

# నయా ఉదారవాద విధానాలు

# కార్మికవర్గ సామాజిక, ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు

ప్రచురణ : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్ కమిటీ

1. ఆధునిక పెట్టుబడిదారీ ప్రపంచపు 'స్వర్ణ యుగం' కనుమరుగైన తరువాత ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ నయా వుదారవాద దశలోకి పరివర్తన చెందింది. అయితే యీ పరివర్తన యిప్పుడు సుదీర్ఘమూ, ప్రగాఢమూ అయిన సంక్షోభంలో చిక్కుకుపోయింది. ప్రపంచస్థాయిలో యీ దశ ప్రధానమైన కొన్ని లక్షణాలను కలిగి వున్నది. అవి – ద్రవ్యీకరణ, ప్రపంచవ్యాప్త ఉత్పత్తి – ప్రపంచవ్యాప్త ఉత్పత్తి సంబంధాలు, నెమ్మదించిన పెరుగుదల–ప్రపంచ ఉత్పత్తి పునఃపంపిణీ, తృతీయ ప్రపంచ సంస్థల ప్రపంచీకరణ, పెరిగిన దోపిడీ– అసమానతలు. ఇతర అనేక వర్ధమాన దేశాలలో లాగానే అనేక భారతీయ కార్పొరేట్ సంస్థలు నయా వుదారవాద విధానాల క్రింద త్వరితగతిన విస్తరించాయి; దానితోపాటే వాటి కార్యకలాపాలలో బహుళజాతి స్వభావాన్ని సంతరించుకోవటాన్ని ప్రారంభించాయి. పెట్టుబడుల కదలికా, శ్రామిక శ్రేణుల నిల్వ, రిజర్వ్ ఆర్మీ పొదుపు విధానాలతో కలసి కార్మికుల వేతనాలను, యితర ప్రయోజనాలనూ తగ్గించాయి. తత్ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా అసమానతలు పెరిగాయి. దీనికితోడు నయా ఉదారవాద విధానాలలో ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటుపరం కావడం అభివృద్ధి చెందుతున్న దేశాలలోని బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా తయారయింది. ఈ ఆర్థిక విధానం తమకు మేలైనదిగా వారు భావించారు.

2. 2. ఈ కాలంలో త్వరితగతిన పెరిగిన ఆర్థిక వ్యవస్థలలో భారతదేశం ఒకటి. అతి కొద్ది భారతీయ వాణిజ్య సంస్థల అదుపులో ఉన్న కార్పొరేట్ రంగం మిగిలిన రంగాల కన్నా త్వరితంగా అభివృద్ధి చెందింది. సేవా, నిర్మాణరంగాలు ఎదుగుతున్నా, ఇప్పటికీ భారతదేశంలోని బడా పెట్టుబడిదారీ వర్గం వస్తుతయారీ రంగంలో ప్రముఖమైన స్థానంలో ఉన్నది; నిజానికి ఆ రంగాన్ని మునుపటి కంటే ఎక్కువగా శాసిస్తున్నది. ప్రస్తుతం యీ వర్గానికే

చెందిన కొన్ని ప్రధానమైన సంస్థలు (భారతి, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి తదితరాలు) వస్తు తయారీ రంగంలో లేనేలేవు. ఉన్న కొద్దిమంది వారి వస్తుతయారీయేతర రంగాలను విస్తరించుకున్నారు. (ఐటి, టెలికం, రిటైల్ వాణిజ్యం, ఇన్సూరెన్స్ తదితరాలు).

3. త్వరితగతిన కార్పొరేట్ పెరుగుదల కారణంగా భారతీయ వాణిజ్య బృందాలు ప్రధానమైన లబ్దిదారులుగా వున్నాయన్నది స్పష్టం. అదే సమయంలో విదేశీ బహుళజాతి సంస్థలు మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకున్నప్పటికీ, కొన్ని రంగాలలో ఆధిపత్యాన్ని కలిగి వున్నప్పటికీ యే ఒక్క విదేశీ సంస్థా భారతీయ కార్పొరేట్ రంగాన్ని స్వాధీనం చేసుకోలేదు. బహుళజాతి సంస్థలు ప్రధానంగా భారతదేశం మార్కెట్‌పైనే ఆసక్తి కనబరిచాయి అంతేగాని, ప్రపంచ మార్కెట్ కోసం వుత్పత్తి స్థావరంగా భారతదేశాన్ని వినియోగించుకోవాలని భావించలేదు. కనుకనే భారతదేశంలోకి వచ్చిపడుతున్న విదేశీ పెట్టుబడులు ప్రధానంగా 'ద్రవ్య' స్వభావాన్ని కలిగి వున్నాయి. అదే సమయంలో భారతీయ సంస్థలు మరింత ఎక్కువగా అంతర్జాతీయత సంతరించుకోవడం వైపు ముఖ్యంగా విదేశాలలో స్వాధీనాలద్వారా అడుగులు వేసాయి. భారతదేశంలోని ఉత్పత్తి కార్యకలాపాలు మరింతగా దిగుమతి ఆధారితాలు కావడంతో దేశ ఎగుమతులు పెరుగుతున్నా దిగుమతులు అంతకు మించి పెరిగాయి.

4. భారతదేశ పెట్టుబడిదారీ అభివృద్ధి యొక్క ప్రస్తుత దశలో కార్మిక వర్గం కుదించుకుపోవటానికి బదులు విస్తరిస్తున్నది. ఈ పెరుగుదలలో అత్యధిక భాగం సంఘటిత పారిశ్రామిక రంగంలో లేకపోయినప్పటికీ గత రెండు దశాబ్దాలుగా, వేతనం, ఉద్యోగిత, ఉత్పత్తి రంగంలో ముఖ్యంగా వ్యవసాయేతర కార్యకలాపాలలో నిర్మాణ, సేవా రంగాలతోసహా పెరిగాయి. వస్తు తయారీయేతర కార్యకలాపాలు చేసే వ్యవస్థీకృత (అసంఘటిత) ప్రైవేటు రంగంలో వుద్యోగిత పెరిగినప్పటికీ, కొద్దిభాగంగా వున్న అత్యున్నత అధికార వర్గం మాత్రమే అధిక వేతనాలను పొందుతున్నది. నిర్మాణ రంగాన్ని మినహాయించితే, అసంఘటిత రంగంలో సైతం కార్పొరేట్ రంగానికి చెందని వ్యవసాయేతర 'సంస్థలలో' 3.8 కోట్లమందికి పైగా పనిచేస్తున్నారు. వారిలో 2.7 కోట్లమంది శ్రామిక కూలీలే. వీరుకాక ఇంటివద్దనే వుండి పనిచేసే మరోరకం శ్రామికులు వున్నారు. నిజానికి వీరు స్వయం వుపాధిపరులుగా పరిగణించబడరు. యజమానుల కోసమే పనిచేస్తుంటారు. వేతన వుపాధిలో

గణనీయమైన పెరుగుదల (సంఘటిత, అసంఘటిత రంగాలలో) నిర్మాణ రంగంలోనూ, దాని అనుబంధ రంగాలలోనూ వున్నది. భారత శ్రమశక్తిలో దాదాపు 11 శాతం (5 కోట్ల ప్రజానీకం) యీ రంగంలోనే వున్నది. ప్రపంచంలోని ఎన్నో దేశాలలోని శ్రామిక వర్గం జనాభా కన్నా భారతదేశంలోని శ్రామికుల సంఖ్య చాలా ఎక్కువ. చారిత్రకంగా చూసినట్లయితే పరిమిత స్వభావం కలిగిన భారతదేశపు పెట్టుబడిదారీ అభివృద్ధినీ, ప్రపంచీకరణ ప్రభావాన్నీ యీ కార్మికవర్గ పరిస్థితీ, స్వభావమూ ప్రతిబింబిస్తున్నాయి.

5. వ్యవసాయ సంక్షోభమూ, పెరుగుతున్న జనాభా ఒత్తిడి కారణంగా ప్రజలు యీ కాలంలో వ్యవసాయ రంగాన్ని విడిచిపెట్టి వ్యవసాయేతర రంగాల్లో వుపాధి కోసం పట్టణ ప్రాంతాలకూ, గ్రామీణ ప్రాంతాలకూ తరలి వెళ్ళారు. రైతుల సంఖ్య తగ్గటంతో ఆ దామాషాలోనే స్వయం వుపాధి కూడా తగ్గింది, జీవిక కోసం తమ శ్రమశక్తిని అమ్ముకోవలసిన వారి సంఖ్య పెరిగింది.

6. ఏదియేమైనప్పటికీ, సంఘటిత రంగంలో, ప్రత్యేకించి వస్తుతయారీ రంగంలో పెరిగిన వుపాధి అవకాశాలు వీరందరినీ యిముడ్చుకోవటానికి సరిపడినంతగా లేవు. పైన తెల్పిన వారిలో అత్యధికులు అసంఘటిత రంగంలోని వేర్వేరు పనులను వెదుక్కున్నారు. అంటే నిర్మాణరంగ కార్మికులుగా, రిక్షా కార్మికులుగా, దినసరి వేతన కూలీలుగా, వీధిలో తిరిగే చిరు వ్యాపారులుగా యింకా యిలాంటి వృత్తుల్లోకి మారిపోయారు. పనుల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు గ్రామాల నుంచి రాష్ట్రంలోని, యితర రాష్ట్రాలలోని పట్టణ ప్రాంతాలకు తరలి వెళ్ళారు. అంతర్జాతీయ వలసలు, అలానే మెరుగైన అవకాశాల కోసం పరాయి దేశాలకు నైపుణ్య కార్మికుల వలసలూ పెరిగాయి. ఆయా పనిరోజుల్లో అనేకమంది వలసలు పోతున్నారు. ఉదాహరణకు, కొంతమంది ఇటుక బట్టీలలో పనిచేసేందుకు యితర రాష్ట్రాలకు వెళ్ళి, వ్యవసాయ పనులు ప్రారంభం కాగానే తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారు. ఇలాంటి వారితోపాటే, భవన నిర్మాణ కార్మికులుగా, దినసరి కూలీలుగా సమీపంలోని పట్టణాలకూ, నగరాలకూ ప్రతినిత్యం వెళ్ళివస్తుంటారు. ఇదే సమయంలో, ప్రతిఫలరహితమైన స్త్రీల శ్రమ, గృహశ్రమ, గృహావసరాలరీత్యా వుత్పత్తితో సంబంధంలేని పనుల కోసం శ్రమశక్తిని అమ్ముకోవటం ఎక్కువైంది.

7. సంఘటిత రంగంలోని ఫ్యాక్టరీలలో దాదాపుగా 111 మిలియన్లు పనిచేస్తుండగా, సంఘటిత రంగంలో 30 మిలియన్ల కంటే తక్కువ మంది రెగ్యులర్ మాత్రమే రెగ్యులర్‌గా పనిచేస్తున్నారు, వీరిలోనూ సుమారుగా 12 మిలియన్లు మాత్రమే పురోగమిస్తున్న ప్రైవేటు రంగంలో వున్నారు. కాగా, 1991లో నయా వుదారవాద విధానాలను ప్రవేశపెట్టిన తరువాత ప్రభుత్వ రంగంలోని రెగ్యులర్ ఉద్యోగులు 20 లక్షలకు కుదించుకుపోయారు. మరీ ముఖ్యంగా పారిశ్రామిక కార్యకలాపాల్లో యీ తగ్గుదల వున్నది. మరోవైపున ప్రైవేటు రంగంలో ప్రధానంగా వస్తుతయారీయేతర రంగాలలో నియమిత వుపాధి అవకాశాలు సుమారుగా 40 లక్షల మందికి సరిపోయేటంతగా మాత్రమే పెరిగాయి.

8. నిజవేతనాల కుదింపుకూ, వుత్పత్తి కార్యకలాపాలలో కార్మికవర్గ దోపిడీని తీవ్రతరం చేయడానికీ నిరుద్యోగ సైన్యం శక్తిని యిస్తున్నది. అందుబాటులోకి వచ్చిన ఆధునిక విజ్ఞానం వుత్పాదకత పెరుగుదలకు దారితీసింది, కాని వేతనాలు మాత్రం స్తంభించిపోయాయి. ఈ పరిస్థితి లాభాలకూ, యితర అదనపు ఆదాయాలకూ అనుకూలమైన రీతిలో ఆదాయ పునఃపంపిణీకి వీలుకల్పించింది. ప్రైవేట్, కార్పొరేట్ రంగాలలో అత్యున్నత విద్యావంతులైన వున్నతాధికారులకు వేతనాలు పెరిగినప్పటికీ కార్మికుల వేతన వాటా కుదించుకు పోయింది. సంపన్నులుగా మారిన మధ్య తరగతిలోని ఒక భాగం ప్రపంచవ్యాప్తంగా సంచరించి అంతర్జాతీయ శ్రామిక శక్తిలో కలసిపోయి నయా వుదారవాదానికి పెట్టని కోటలా తయారైంది. ఈ సామాజిక బృందమే నిరంతరం ప్రసారమాధ్యమంలోనూ, విద్యా రంగంలోనూ, వున్నతాధికార వర్గంలోనూ యింకా యితరంగానూ కన్పిస్తుంటుంది. అయితే, ఆదాయ తారతమ్యాలు వున్నప్పటికీ కార్మికులూ, వుద్యోగులూ అంతకంతకూ పెరుగుతున్న పెట్టుబడి నియంతృత్వానికీ (అలానే 'సమర్థతా', అధిక వుత్పాదకత అన్న నిరంతర డిమాండుకు) గురవుతున్నారు.

9. పెట్టుబడి నియంతృత్వాన్ని బలోపేతం చేయటానికి వీలుగా వివిధ పద్ధతులను, సాధనాలను చేపట్టటమే పెట్టుబడిదారీ విధానం యొక్క యీదశ లక్షణంగా వున్నది. దీనికితోడు శ్రమశక్తిని పణంగాపెట్టి గరిష్ట లాభాలను పొందేందుకు ప్రభుత్వం అంతకంతకూ వీలు కల్పిస్తున్నది. కాగా, వుత్పాదకతను పెంచటానికి యజమానులు రకరకాల చర్యలను చేపడుతున్నారు. అంతేకాక, యిదే సమయంలో తమ లాభాలను పెంచుకునేందుకు లేదా లాభాలను

నిలబెట్టుకునేందుకై పెరిగిన వుత్పత్తిలో కార్మికులకు రావలసిన భాగాన్ని దోచివేస్తున్నారు.

10. ఆచరణలో బహుకొద్దిమంది కార్మికులకు మాత్రమే వర్తించినప్పటికీ, కార్మికులను 'బలహీనపరచటానికీ', అలానే శ్రామికుల 'నియామకానికీ–తీసివేతకూ' యజమానులకు మరింత స్వేచ్ఛ కల్పించటానికీ వుపయోగపడే కార్మిక చట్ట సవరణలు నయా వుదారవాదంలో ప్రధాన అంశంగా వున్నాయి. పారిశ్రామిక వివాదాల చట్టం, కార్మిక సంఘాల చట్టం, కాంట్రాక్ట్ కార్మికుల (రెగ్యులర్–అబాలిషన్) చట్టం వగైరా ప్రధానమైన కార్మిక చట్టాలను సవరించేటందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటికే రాజస్థాన్ ప్రభుత్వం వీటిని సవరించటంతో కేంద్ర ప్రభుత్వం కూడా యీ బాటనే పట్టింది. కార్మిక చట్టాలు అమలులో వున్నప్పటికీ వాటి అమలునుకాక, వుల్లంఘనలనే ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది.

11. పెట్టుబడులను ఆకర్షించి, వస్తుతయారీని పెంచేపేరుతో ప్రత్యేక ఆర్థిక మండలాలు / జాతీయ వస్తుతయారీ మరియు పెట్టుబడుల మండలాలు / ప్రత్యేక పెట్టుబడుల మండలాలు / ఎగుమతులు లక్ష్యంగావున్న పరిశ్రమలు వగైరా పేరుతో ప్రభుత్వం కొన్నిటిని సృష్టించింది. ఇక్కడ కార్మిక చట్టాలకు మినహాయింపు వుంటుంది, లేదా, తనిఖీలను నియంత్రించడం ద్వారా చట్టాల వుల్లంఘనను అనుమతిస్తున్నది. నిర్దిష్ట కాలంతోపాటు పన్నులు తదితర మినహాయింపులను, రాయితీలను పొందిన తరువాత తమ పరిశ్రమలను యితర మండలాలకు తరలిస్తున్న వుదంతాలు అనేకం వున్నాయి. కాగా, కార్మికులు మాత్రం యిలాంటి సమయాలలో తమ వుద్యోగాలను కోల్పోతున్నారు.

12. నయా వుదారవాదం అడుగు పెట్టక ముందు కార్మికులు తమ చట్టబద్ధమైన హక్కులను పోరాటాల ద్వారా, లేదా న్యాయస్థానాల జోక్యం ద్వారా అమలు చేయించుకోగలిగేవారు. ఉదాహరణకు, కాంట్రాక్టు కార్మిక (ఆర్–ఏ) చట్టాన్ని వుపయోగించుకుని వేలమంది శ్రామికులు ఉక్కు (దుర్గాపూర్, ఇస్కో, రూర్కేలా, భిలాయ్ ఉక్కు కర్మాగారంలోని కేంటీన్ కార్మికులు తదితరులు), పౌరవిమానయానం (ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ), విద్యుత్ (హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ మొదలైన రాష్ట్రాల విద్యుత్ బోర్డులు) రవాణా రంగం వంటివాటిల్లో తమ వుద్యోగాలకు రక్షణను కల్పించు

కోగలిగారు. అయితే, సెయిల్, కోల్ ఇండియాలు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీం కోర్టు గతంలో ఎయిర్ ఇండియా వ్యవహారంలో తానే యిచ్చిన తీర్పును పాక్షికంగా రద్దు చేయటంతో నయా వుదారవాద శకంలో యీ పరిస్థితిలో మార్పు వచ్చింది. నయా వుదారవాదం ప్రవేశించిన తరువాత న్యాయవ్యవస్థ వ్యాఖ్యానాలు అంతకంతకూ పెట్టుబడికి అనుకూలంగా వుంటున్నాయి.

13. నయా వుదారవాద ప్రపంచీకరణ కింద పెట్టుబడి నియంతృత్వాన్ని మరింత పటిష్టం చేయటం కోసం తీసుకున్న చర్యలలో ఒకటి కార్మికవర్గ పొందికలో సమూల మార్పులు తీసుకురావటం. ఏరకమైన చట్టబద్దమైన ప్రయోజనాలు లేని కార్మికుల సంఖ్య పెరుగుతుండగా, చట్టబద్దమైన రక్షణను పొందుతున్న కార్మికుల సంఖ్య బాగా తగ్గిపోయింది. వృత్తులు, ప్రదేశాలు, యాజమాన్యాలు చుట్టూ తిరుగుతున్న అసంఖ్యాక కార్మికులు అత్యల్పమైన ఆర్థిక ప్రయోజనాలను మాత్రమే పొందగలుగుతున్నారు. దీనికితోడు భారతదేశంలో కార్మికులపై పెట్టుబడి తన పట్టును పటిష్టం చేసే యంత్రాంగం కేవలం యీ 'ఆధునిక'మైన వాటికే పరిమితం కాలేదు. కులము, మతము, స్త్రీ పురుష వ్యత్యాసాల వంటివాటిని కూడా యిందుకోసం వుపయోగించటం జరుగుతున్నది.

14. విభిన్న రంగాలలో కార్మికుల స్థితిగతులలో వచ్చిన మార్పులకు సంబంధించి కొన్ని వివరాలను దిగువన యిస్తున్నాము.

◆ ***సంఘటిత రంగ కార్మికులు***

ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో సహా సంఘటిత రంగంలోని పర్మినెంటు కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉన్నంతలో పర్మినెంట్ కార్మికులు మెరుగైన వేతనాలను, సాంఘిక భద్రతా ప్రయోజనాలను పొందుతున్నప్పటికీ వారు కూడా అనిశ్చితమైన పని పరిస్థితులను ఎదుర్కొనవలసి వస్తున్నది. ఇది చాలదన్నట్లుగా పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు శ్రామికులను వినియోగిస్తూ, పర్మినెంట్ కార్మికుల వేతనాల మొత్తాన్ని తగ్గించటానికీ, యూనియన్‌లను బలహీనపరచటానికీ తద్వారా బేరసారాలు చేసే శక్తిని నిరోధించటానికై యజమానులు రకరకాల చర్యలను చేపడుతున్నారు. ఒకే రకమైన వుద్యోగాలలో 'ఆన్ జాబ్ ట్రైనీస్ (ఓజెటి)', 'లాంగ్ టెర్మ్ ట్రైనీ ఎంప్లాయీస్ (ఎల్‌టిటిఇ)', 'ఫిక్సెడ్ టెర్మ్ కాంట్రాక్ట్స్ (ఎఫ్‌టిసి)', 'జూనియర్ ఎగ్జిక్యూటివ్స్' తదితర విభాగాలు వున్నాయి. వీరికి, పర్మినెంట్ వుద్యోగులకు యిస్తున్న దానిలో నామమాత్రమైన

మొత్తాన్ని మాత్రమే వేతనంగా యిస్తున్నారు. ఉదాహరణకు తమిళనాడులో వున్న జపాన్‌కు చెందిన కెన్‌స్టార్ కంపెనీలో 1080 మంది ట్రైనీలు వుండగా, పర్మినెంటు కార్మికులు కేవలం 73మంది మాత్రవే వున్నారు. (ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళంలో వున్న రెడ్డీ లాబ్స్‌లో ఒక మెస్‌ను ప్రారంభించారు. ఇందులో జీతానికి బదులుగా పనిచేసేవారు ఉచితంగా భోజనం చేసి దూరవిద్య పొందవచ్చు.)

ఉత్పాదకతను పెంచటానికీ, గరిష్ఠస్థాయిలో శ్రామికులనుండి అదనపు విలువను పిండటానికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్నీ, యాంత్రీకరణనూ, ఆటోమేషన్‌నూ, రోబోలనూ వుపయోగించటం, పనిగంటల పెంపుదల, వేతనాల తగ్గింపు వంటి రకరకాల చర్యలను యాజమాన్యం చేపడుతున్నది. ఉత్పాదకతను పెంచేటందుకై ఫ్రీక్వెంట్ టైమ్ అండ్ మోషన్ (ఎఫ్‌టిఎం), అధ్యయనం (పనిపద్ధతుల అధ్యయనం), ఇ–మేనేజ్‌మెంట్, స్వీయ యాజమాన్య బృందాలు (ఎస్‌ఎంటి) వగైరా విభిన్నమైన యాజమాన్య విధానాలను ప్రయోగించటం జరుగుతున్నది. కార్మికులను, కార్మికులుగా కాకుండా యాజమాన్యంలో భాగస్వాములన్న భ్రమలను సృష్టించేటందుకై వారిని 'అసోసియేట్స్', 'టీమ్ సభ్యులు' అన్న పేర్లతో పిలుస్తున్నారు. ఆల్ టైమ్ మేనేజ్‌మెంట్ పద్ధతి (ఏటిఎంఎస్) ప్రకారం అశోక్ లేలాండ్ శ్రామికులు ఎనిమిది గంటలలో 480 నిముషాలపాటు పనిచేయాల్సి వుంటుంది. కనీసం టాయ్‌లెట్స్‌కు వెళ్ళటానికి కూడా వీలులేదు. చివరకు సేదతీరేందుకు కనీస విరామ సమయాన్ని కూడా యివ్వలేదు. పలు బహుళజాతి సంస్థల్లో 'సంపూర్ణ ఉత్పత్తి యాజమాన్య పద్ధతి (టిపిఎం)' క్రింద సమయాన్నీ, సామాజికంగా అవసరమైన శ్రమశక్తి వ్యయాన్నీ పథకం ప్రకారం తగ్గిస్తున్నారు. తత్ఫలితంగా ఆధునిక సంఘటిత రంగ పరిశ్రమల్లోని కార్మికులు వున్నంతలో మెరుగైన వేతనాలనూ, యితర సౌకర్యాలను పొందటానికి బదులుగా పెద్దయెత్తున మానసిక ఒత్తిళ్ళను, వేధింపులను ఎదుర్కొంటున్నారు.

ఒక అధ్యయనం ప్రకారం 2011–12లో సంఘటిత వస్తుతయారీ రంగంలోని మొత్తం శ్రామికులలో 77.5 శాతం మందికి లిఖిత కాంట్రాక్టులు లేవు; మరో 2.43 శాతం మందికి లిఖిత కాంట్రాక్టులు వున్నప్పటికీ అవి ఏడాదిలోపు కాలానికి మాత్రమే చెందినవి. మొత్తం శ్రామికులలో కేవలం 17.41 శాతం మంది మాత్రమే మూడేళ్ళకు మించిన కాలానికి లిఖిత

కాంట్రాక్టులను కలిగి వున్నారు. సంఘటిత రంగానికి చెందిన మొత్తం నియమిత వేతన శ్రామికులలో 70 శాతం పైగా లిఖిత కాంట్రాక్టులు లేవు. మహిళా కార్మికుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. 2011-12లో 91 శాతం మందికి లిఖిత కాంట్రాక్టులు లేవు; కేవలం 6.3 శాతం మంది మాత్రమే మూడేళ్ళకు పైగా లిఖిత కాంట్రాక్టులను కలిగి వున్నారు. నియమిత కార్మికులలో 60 శాతం మందికి ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, ఆరోగ్య సంరక్షణ వగైరా వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందుబాటులో లేవు. పురుష కార్మికులకన్నా మహిళా కార్మికులు దుర్భరమైన స్థితిలో వున్నారు.

సంఘటిత వస్తు తయారీ రంగంలో 2000వ సంవత్సరం నుంచి కార్మికులకూ, పర్యవేక్షణ సిబ్బందికీ మధ్య అసమానతలు పెరిగాయి. కార్మికులతో పోల్చుకుంటే యాజమాన్య సిబ్బంది వేతనాలు త్వరితగతిని పెరుగుతున్నాయి.

◆ ***సంఘటిత రంగానికి చెందిన అసంఘటిత విభాగ కార్మికులు***

నయా ఉదారవాద విధానాల ప్రవేశంతో ఉపాధి సంబంధాల స్థూల దృశ్యం సమూలంగా మారిపోయింది. ప్రైవేటు రంగంలోనే కాక ప్రభుత్వ రంగంలో సైతం అసంఖ్యాక కార్మికుల విషయానికి వస్తే యజమాని, వుద్యోగి సంబంధాలను స్పష్టంగా నిర్వచించడంగానీ, గుర్తించడంగానీ జరగలేదు. నయా వుదారవాద విధానాల కారణంగా సంఘటిత రంగంలోని అసంఘటిత కార్మికులు, అంటే వుద్యోగ భద్రత, ఆదాయ భద్రత, సామాజిక భద్రత, న్యాయ సంరక్షణ ఏమాత్రం లేని అనిశ్చిత పని పరిస్థితిలో వున్న కార్మికుల సంఖ్య పెరిగింది. అయినప్పటికీ యీ కార్మికులను అసంఘటిత రంగ కార్మికులుగా పరిగణించజాలము.

మార్కెట్ అస్థిరత కారణంగా సంభవించే భారాలను వివిధ పద్ధతుల ద్వారా కార్మికులపై నెట్టివేస్తున్నారు. ఇందుకుగాను, కాంట్రాక్టులు, ఔట్‌సోర్సింగ్, తీసివేతలు, వుద్యోగ కాంట్రాక్టులు, లేదా అదే పనిని తాత్కాలిక, దినసరి వేతన శ్రామికులు, అప్రెంటిస్ లేదా ట్రైనీల ద్వారా చేయించడం, కుటీర పరిశ్రమ తదితర పద్ధతులను వినియోగించడం చేస్తున్నారు.

అసంఘటిత రంగంలోని పరిశ్రమలకు సంబంధించిన నేషనల్ కమిషన్ నివేదిక (2000) ప్రకారం, ఆర్థిక సంస్కరణల అనంతర కాలంలో సంఘటిత రంగంలో నింపిన వుద్యోగాలు ప్రధానంగా అనియతమైనవి. 1990ల

ప్రారంభంలో వస్తుతయారీ రంగంలో పెరిగిన వుద్యోగాలు ప్రధానంగా తాత్కాలికమైనవేనని పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి. 1992–2001 మధ్య కాలంలో దేశం మొత్తంమీద వస్తుతయారీ రంగంలో పాలన, నిర్వహణ విభాగాలకు చెందిన సిబ్బంది మినహా కాంట్రాక్టు, తాత్కాలిక కార్మికుల వాటా రెట్టింపు అయింది. కార్మికులకు వుద్యోగ భద్రతను కల్పించే కార్మిక చట్టాలు వునికిలో వున్నప్పటికీ, నేరుగా నియమించిన పర్మినెంటు కార్మికుల స్థానంలో అనియత, అనిశ్చిత పని సంబంధాలతో కూడిన కార్మికులను తీసుకు వస్తున్నారు. 2003–04 నుంచి 2009–10 మధ్య కాలంలో కార్మికుల ప్రత్యక్ష నియామకంలో కేవలం 5.1 శాతం పెరుగుదల మాత్రమే వున్నది. కాగా యిదే కాలంలో కాంట్రాక్టు కార్మికుల వాటా 12.4 శాతం పెరిగింది. సంఘటిత రంగంలోని మొత్తం వుద్యోగాలలో కాంట్రాక్టు కార్మికుల వాటా 1995–96లో 10.5 శాతంగా వున్నదల్లా 2009–10 నాటికి 25.7 శాతానికి పెరిగింది. ఇదే సమయంలో ప్రత్యక్ష నియామక కార్మికుల వాటా 68.3 శాతం నుంచి 52.4 శాతానికి తగ్గింది. గమనించవలసిన విషయమేమంటే, 50 మందికన్నా ఎక్కువగా పనిచేసే కంపెనీలలో 2000 సంవత్సరం చివరి నాటికి అంతకు ముందుకన్నా కాంట్రాక్టు కార్మికుల నియామకం పెరిగింది. 2009–10 నాటికి, 5000 మందికి మించి పనిచేసే కంపెనీలలో దాదాపుగా సగభాగం కార్మికులు కాంట్రాక్టు  కార్మికులే.

ఉదారవాదం ప్రవేశించక ముందు తక్కువ నైపుణ్యం కలిగిన వుద్యోగాలలో మాత్రమే కాంట్రాక్టు పద్ధతి వుండేది. నయా వుదారవాదం వచ్చిన తరువాత అత్యున్నత స్థాయిలో మినహా దాదాపుగా అన్ని స్థాయిల్లోనూ కాంట్రాక్టు కార్మికులు లేదా వుద్యోగులు వుంటున్నారు. సగటున చూసినట్లయితే, ప్రభుత్వ రంగంలో దాదాపు 50 శాతం కార్మికులు, అలానే బహుళజాతి సంస్థలకు చెందిన ఆధునిక పారిశ్రామిక సంస్థలతో సహా ప్రైవేటు రంగంలో 70 శాతంపైగా కాంట్రాక్టు కార్మికులే వున్నారు.

వేర్వేరు భాగాలను లేదా మొత్తం వుత్పత్తి ప్రక్రియను యితర సంస్థలకు బదలాయింపు, ఔట్‌సోర్సింగ్, పంపిణీల ద్వారా వికేంద్రీకరించటం లేదా విభజించడం జరుగుతున్నది. ఈ పనులను వేర్వేరు చోట్లకు తరలిస్తున్నారు. తరచుగా కార్ఖానాలకు, ఇంటివద్ద వుండి పనిచేసే వారికి అప్పగిస్తున్నారు లేదా  అదే ప్రాంగణంలో వున్నవారికి యిస్తున్నారు. అయితే యీ కార్మికులకు

ప్రధానమైన యజమానులతో ఎలాంటి ప్రత్యక్ష సంబంధాలు వుండవు, వారు కూడా యీ కార్మికులపట్ల ఎలాంటి బాధ్యతలనూ పెట్టుకోరు. ఇదియిలా వుండగా యిటీవల 'ఆన్‌లైన్ మార్కెటింగ్' వునికిలోకి వచ్చి విస్తరించింది. డిమాండును అనుసరించి సరుకును పరిమితం చేయటానికీ, శ్రామికులను నియమించటానికీ సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని వుపయోగిస్తున్నారు.

ఆటోమొబైల్ రంగం వంటి అత్యంత అధునాతనమూ, ఆధునికమూ అయిన వుత్పత్తి విధానం కలిగిన చోట కూడా అదే ప్రాంగణంలో పర్మినెంటు కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులను కూడా నియమించడం ఎక్కువ అవుతున్నది. మారుతి, హ్యూండై వగైరాలను యిందుకు వుదాహరణగా చెప్పవచ్చు. సంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు ఉద్యోగభద్రత ఉంటుందన్న భ్రమ, మారుతిలోని 500 మంది పర్మినెంట్ కార్మికులను, 1500 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడంతోనూ, నోకియా కంపెనీని మైక్రోసాఫ్ట్ స్వాధీనం చేసుకోగానే 8000 మంది కార్మికులను తొలగించడంతోనూ తొలగిపోయింది.

పెద్ద ఎత్తున పనులను కాంట్రాక్టు పద్ధతిలో చేయించుకోవడం వలన జీతాలవాటా (1980లో 30% నుండి 2009లో 9.5%నికి) పడిపోగా లాభాలవాటా విపరీతంగా(15% నుండి 55%) పెరిగింది.

- ***అసంఘటిత రంగ కార్మికులు***

నయా వుదారవాద శకంలో అసంఘటిత రంగ కార్మికుల సంఖ్య వ్యవసాయరంగంలో పనిచేస్తున్నవారిని కలపకుండానే పెరిగింది. మొత్తం శ్రామికుల్లో అసంఘటిత రంగ శ్రామికులు 94 శాతం వున్నారు. వీరిలో వ్యవసాయరంగ కార్మికులు కూడా కలసి వున్నారు. అయితే వ్యవసాయ సంక్షోభం కారణంగా వ్యవసాయంలో పనిదినాలు తగ్గటంతో అనేకమంది కార్మికులు వ్యవసాయేతర పనుల కోసం పట్టణ ప్రాంతాలకు, గ్రామీణ ప్రాంతాలకు సైతం వలసలు పోవలసివస్తున్నది. అనువర్తిత మానవ శ్రమ పరిశోధనా సంస్థ సమర్పించిన ఒక పత్రం ప్రకారం స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశంలో మొట్టమొదటి సారిగా 2004-05 నుంచి 2011-12 మధ్య కాలంలో వ్యవసాయ రంగంలో పనిచేసే శ్రామికుల్లో 3.67 కోట్లమంది పనులను కోల్పోయారు. గ్రామీణ ప్రాంతంలోని శ్రామికులను యీనాడు ప్రత్యేకించి 'వ్యవసాయ కార్మికులు' అంటూ వర్గీకరించలేము ఎందుకంటే

వారు తమ జీవనోపాధి కోసం ఏడాదిలో ఎనిమిది మాసాలపాటు వ్యవసాయేతర పనులు చేస్తున్నారు. ఈ శ్రామికులను సంఘటితం చేయటానికిగాను కార్మిక సంఘాలు మరింత చొరవ చూపవలసిన అవసరం వున్నది.

అసంఘటిత రంగ కార్మికులందరి పని పరిస్థితులు ఒకేలా వుండవు. వారు పనిచేస్తున్న రంగము, లేదా వృత్తి, వారి నైపుణ్యము, లింగ, కుల, పనిస్థలము, వలస వచ్చిన వారిగా వారి స్థితి వగైరాలపై ఆధారపడి రకరకాలుగా వుంటాయి. వీరిలో స్వయం వుపాధి చేసుకునేవారు, కుటీర పరిశ్రమ శ్రామికులు, దినసరి కార్మికులు వున్నారు. అసంఘటిత రంగంలో సరకులను, ప్రయాణీకులను చేరవేసే ప్రైవేటు రవాణా వంటి కొన్ని విభాగాలు దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్రను నిర్వహిస్తున్నాయి, అలానే కొన్ని లక్షల మందికి వుపాధిని కల్పిస్తున్నాయి.

వేతనాలకు, పని పరిస్థితులకు సంబంధించి అసంఘటిత రంగ కార్మికులకు అత్యల్పమైన చట్ట పరిరక్షణ మాత్రమే వున్నది. ఆ ఉన్న కొద్దిపాటి కూడా సమర్ధవంతంగా అమలు కావటం లేదు. 2011–12లో 93 శాతం దినసరి శ్రామికులు సామాజిక భద్రతా ప్రయోజనాలకు అర్హులు కాలేదు. వారి పరిస్థితి మరింతగా దిగజారింది.

నయా వుదారవాద శకంలో విద్య, ఆరోగ్యాల నుంచి ప్రభుత్వం తప్పుకుని, ఆ స్థానంలో ప్రైవేటు రంగం రావటంతో అసంఘటిత రంగానికి చెందిన శ్రామికులు దారుణంగా దెబ్బతిన్నారు. విద్య, వైద్యాలకు అయ్యే వ్యయం అపారంగా వుండటంతో అసంఘటిత రంగంలోని శ్రామిక కుటుంబాలు అప్పుల పాలవుతున్నాయి. నగర సుందరీకరణ, మురికి వాడల తొలగింపు వంటి కార్యక్రమాల కారణంగా వీరందరూ పట్టణ శివారులకు వెళ్ళవలసి వస్తున్నది. తత్కారణంగా నివాస స్థలం నుంచి పనిస్థలానికి రావటానికి రవాణా వ్యయం పెరిగింది. అసంఘటిత రంగ కార్మికులలో అత్యధికులు మురికివాడల్లో, అనారోగ్యకర వాతావరణంలో జనసమ్మర్ధంలో నివసించవలసి వస్తున్నది.

కాంట్రాక్టు కార్మికులకు, వీధి వ్యాపారులకూ సంబంధించిన శ్రామిక మార్కెట్లను అదుపు చేయటంలోనూ, 'నియంత్రించటంలోనూ' నేరగాళ్ళు నిర్వహించే పాత్ర అంతకంతకూ ఎక్కువవుతున్నది. త్వరితగతిన విస్తరిస్తున్న పట్టణీకరణ కారణంగా మురికివాడలలో గృహాలను ఏర్పాటు చేయటంతోపాటు,

వాటిని అదుపు చేయడంలోనూ, భూవివాదాలను పరిష్కరించడంలోనూ స్థానిక మాఫియా ముఠాల ప్రమేయం పెరుగుతున్నది. ఈ విధంగా అసంఘటిత కార్మికులు పని స్థలాల్లో యజమానుల దోపిడీకి గురికావటంతోపాటు తమ నివాస ప్రాంతాల్లో యీ మాఫియాలకు తలవంచి బతకవలసి వస్తున్నది.

### *ఇంటివద్దనే వుండి పనిచేసే శ్రామికులు*

నయా వుదారవాద శకంలో ఇంటి వద్దనే వుండి పనిచేయటం పెరిగింది. కొన్ని బహుళజాతి సంస్థలు సైతం తమ పనులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఇంటివద్దనే వుండి పనిచేసే వారికి అప్పగిస్తున్నాయి. ఈ పనంతా కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు, ఏజెంట్లు, మధ్యవర్తులు అన్న క్రమంలో సాగుతున్నది. దీనివల్ల అసలు యజమాని ఎవరో పనిచేసే వారికి తెలియనే తెలియదు. ఇంటినుంచి పనిచేసే వారు యజమానుల రికార్డుల్లోనూ వుండరు, ప్రభుత్వ సర్వేల్లోకి ఎక్కరు; అసలైన యజమాని శ్రామికునికి కనిపించడు, అలానే ఇంటివద్ద వుండి పనిచేసేవారు ప్రభుత్వానికీ, పాలనాధికారులకూ కనిపించరు; యజమాని, వుద్యోగి సంబంధాలు పూర్తిగా మరుగునపడి వుంటాయి. దోపిడీ మాత్రం తీవ్రంగా వుంటుంది. నయా వుదారవాద కాలంలో సమాచార సాంకేతిక విజ్ఞానాన్ని వాడుకోవటం పెరగటంతో ఐటి, ఐటి వుపయోగిత పనులకు కూడా ఇంటివద్దనే వుండి పనిచేసేవారు లభిస్తున్నారు. ఇంటివద్ద నుండి పనిచేసేవారికన్నా యిలాంటి వారు విద్యాధికులు, మంచి వేతనాలను పొందేవారుగా వుండవచ్చు, కాని వారికి కూడా వుద్యోగ లేదా సామాజిక భద్రత అనేవి వుండవు, వారు కూడా తీవ్రమైన దోపిడీకి గురవుతూనే వుంటారు.

ఇంటివద్ద వుండి పనిచేసే వారిలో ఎక్కువమంది మహిళలు. తరచుగా వారిని 'స్వయం వుపాధిపరులుగా' చూపుతుంటారు. యజమాని, వుద్యోగి సంబంధాలను మరుగుపరిచేటందుకై శ్రామికులకు ముడిసరకును అమ్మినట్లు, తయారైన వస్తువును కొనుగోలు చేసినట్లు చూపుతారు.

ఇంటివద్ద నుండి పనిచేసేవారిలో అత్యధికులకు ఏ చట్టమూ వర్తించదు. కేరళ, తమిళనాడు, కర్ణాటక వంటి కొన్ని రాష్ట్రాలు వారికి సంక్షేమ ప్రయోజనాలను కల్పించినప్పటికీ, అవి వారి పనిపరిస్థితులకు వర్తించవు. 2006లో దేశంలోని పది రాష్ట్రాలలో సిఐటియు చేసిన సర్వే ప్రకారం ఇంటివద్ద వుండి పనిచేసేవారిలో 60 శాతం మంది, అంతర్జాతీయ కార్మిక సంస్థ తీర్మానం ప్రకారం శ్రామికులే అవుతారు. అంతేగాని స్వయం వుపాధిపరుల కిందకు

రారు. వారికి వేతనాల కింద చాలా తక్కువగా చెల్లిస్తున్నారు. సర్వేలో వెల్లడైన ప్రకారం, తరచుగా పిల్లలతో సహా తమ కుటుంబ సభ్యుల సహకారంతో రోజులో 8 నుంచి 10 గంటల వరకు పనిచేసినప్పటికీ ఇంటివద్ద నుండి పనిచేసే వారికి సగటు నెలసరి ఆదాయం రూ.1,000లకన్నా తక్కువగా వుంటున్నది. దోపిడీ ఏ మేరకు జరుగుతున్నదీ యీ వుదంతం తెలియచేస్తున్నది. కుటుంబ బాధ్యతలతో సమన్వయం చేసుకునే అవకాశం వున్నందున ఇంటివద్ద నుండి చేసే పనికి స్త్రీలు ఎక్కువగా మొగ్గుచూపుతారని సాధారణంగా వుండే అభిప్రాయం. కాని, తద్విరుద్ధంగా ప్రత్యామ్నాయం లేకనే వారు యీ వుద్యోగాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

**స్వయం ఉపాధి శ్రామికులు**

స్వయం ఉపాధి అనేది నయా వుదారవాదంతో వచ్చింది కానప్పటికీ, యీ కాలంలో స్వయం వుపాధిపై ఆధారపడిన వారి సంఖ్య పెరిగింది. గ్రామాల నుంచి పట్టణాలకు వలసపోయిన అనేకమంది శ్రామికులు రిక్షా కార్మికులుగానో, వీధి వ్యాపారులుగానో ఆటోలు నడిపేవారుగానో వుంటున్నారు. ఇలాంటి వారికి పెద్దగా ఆదాయంగానీ లేదా సామాజిక భద్రతగానీ వుండటం లేదు. స్వయం వుపాధి అనేది యిష్టపూర్వకంగా తీసుకున్నదిగాకాక, తప్పనిసరి పరిస్థితిలో తీసుకుంటున్నదిగానే వుంటున్నది. స్వయం వుపాధిని చేపట్టిన వారిలో స్త్రీలు ఎక్కువగా వుంటున్నారు. తరచుగా వారికిది ప్రతిఫలరహితమైన చాకిరిగానే వుండిపోతున్నది.

◆ ***(పథక శ్రామికులు) స్కీమ్ వర్కర్లు***

పేదల పొట్టకొట్టిన నయా వుదారవాదం చేసిన గాయాలవల్ల కలిగిన బాధను కాస్త వుపశమింప చేసేందుకై కేంద్ర ప్రభుత్వమూ, అలానే పలు రాష్ట్ర ప్రభుత్వాలు అనేక 'పథకాలను' ప్రవేశపెట్టాయి. అయితే, వేతనాలకు, యితర ప్రయోజనాలకు సంబంధించిన చట్టబద్ధమైన అంశాలనుండి తప్పించుకునేందుకై యీ పథకాల కింద పనిచేస్తున్న వారిని అటు కార్మికులుగాగానీ లేదా యిటు వుద్యోగులుగాగానీ గుర్తించటానికి ప్రభుత్వాలు నిరాకరిస్తున్నాయి. వారిని 'సంఘ సేవకులు', 'వలంటీర్లు', 'కార్యకర్తలు', 'యశోదాలు', 'మమతాలు', 'అతిథులు' వగైరా పేరులతో పిలుస్తున్నారు. ఇలాంటి వారిలో కొంతమందికి నామమాత్రమైన 'గౌరవభృతి', లేదా 'ప్రోత్సాహక భృతి', లేదా 'ఏకీకృత చెల్లింపు' అన్న పేరుతో చెల్లింపులు

చేస్తున్నారు. కొంతమందికి యీ మాత్రం కూడా వుండటం లేదు. అలాంటి వారు తమను తాము కాపాడుకోవటానికై 'వినియోగ ఛార్జీలను' వసూలు చేసుకుంటున్నారు. ఒక అంచనా ప్రకారం యిలాంటి శ్రామికులు లేదా వుద్యోగులు దాదాపుగా కోటిమంది వుంటారు. వీరిలో ఎక్కువమంది స్త్రీలు. వీరు ఐసిడిఎస్, ఎన్ఆర్హెచ్ఎం, ఎస్ఎస్ఏ, మధ్యాహ్న భోజన పథకం వంటివాటిల్లో పనిచేస్తున్నారు. మానవ అభివృద్ధి సూచికలను మెరుగుపరచటానికి యివి వుపయోగపడాలి.

ఈ పథక శ్రామికుల్లో అత్యధికులు మారుమూల పల్లెల్లోనూ, అడవుల్లో నివసించే వివిధ తెగల ప్రజలుండే ప్రాంతాల్లోనూ పనిచేస్తుంటారు.

అనేక రాష్ట్రాల్లో అంగన్వాడీల వంటి కొంతమంది శ్రామికులు తమ డిమాండ్ల కోసం సమరశీల పోరాటాలు సాగిస్తున్నారు. ఆశా, మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేసేవారు కూడా పలు రాష్ట్రాల్లో సంఘటితపడుతున్నారు.

ఇలాంటివారు చేసే పని స్వభావం కారణంగా యీ శ్రామికులు కష్టజీవులతో ప్రత్యేకించి పేదలతోనూ, సామాజికంగా అట్టడుగున వున్నవారితోనూ, రైతులతోనూ, వ్యవసాయ కార్మికులతోనూ, అసంఘటితరంగ శ్రామికులు వగైరాలతోనూ సన్నిహిత సంబంధాలను కలిగి వుంటారు. ఈ (పథక శ్రామికులను) స్కీమ్వర్కర్స్ని సంఘటితపరచి, వారిలో రాజకీయ చైతన్యాన్ని పెంచటానికి అవిరామ కృషి జరిపినట్లయితే అది మన కార్యక్రమాలను, విధానాలను దేశంలోని మారుమూల ప్రాంతాలకు, అదేవిధంగా విస్తృత ప్రజానీకం వద్దకు తీసుకువెళ్ళటానికి సహాయకారిగా వుండగలదని పలు రాష్ట్రాలలోని మన అనుభవం తెలుపుతున్నది.

### ◆ *మధ్యతరగతి ఉద్యోగులు*

వేతన వ్యయాన్ని తగ్గించేటందుకై వుద్యోగుల సంఖ్యను బాగా తగ్గించేయటం నయా వుదారవాద విధానాలలో ఒక అంతర్భాగం. ఇందువల్ల, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల కార్యాలయాలు, రైల్వే తదితర రంగాలలో పనిలో వున్నవారిపై పనిభారం పెరుగుతున్నది. ఎవరికైతే కార్మికసంఘ హక్కులు లేవో, ఎవరైతే ఎక్కువ గంటల పని చేయవలసి వస్తున్నదో అలాంటి 'ఆఫీసర్లు', 'కార్యనిర్వాహక అధికారులు' సంఖ్యరీత్యా పెరుగుతున్నారు. కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఆఫీసర్ల, క్లర్కుల నిష్పత్తి పెరిగి యీనాడు 3:1 కి చేరింది. కార్మిక చట్టాలు వర్తించకుండా వుండేటందుకై వుద్యోగాల పేర్లను మారుస్తున్నారు.

'సేల్స్‌పర్సన్' అన్న పదం 'సేల్స్ ఎగ్జిక్యూటివ్'గా మారింది. ఇలా పేర్లను మార్చటం వెనుక వుద్యోగులు సంఘటితం కాకుండా చూడాలన్న వుద్దేశం కూడా వున్నది.

ఉద్యోగ భద్రత లేకపోవటమూ, ఒక వుద్యోగం నుంచి మరొక ఉద్యోగానికి మారటమూ ఆమోదిత ప్రమాణాలుగా వున్నత విద్యావంతులు, వున్నంతలో మెరుగైన వేతనాలు పొందుతున్న కొంతమంది ప్రైవేటురంగ వుద్యోగులు భావిస్తున్నారు. అయితే వీరు లక్ష్యాన్ని చేరుకోవటానికై అమితమైన పనిభారాన్ని భరించవలసి వస్తున్నది. అణచివేత కూడా తీవ్రంగా ఉన్నది.

ప్రభుత్వరంగ బ్యాంకులలో మార్కెటింగ్‌తో కూడిన పాలనాధికారులను నియమిస్తున్నందున బహుళ పని విధానాన్ని ప్రవేశపెట్టినట్లయింది. ప్రభుత్వరంగ బ్యాంకులో సైతం ఔట్‌సోర్సింగ్ పద్ధతిని ప్రవేశపెట్టేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఉదాహరణకు, స్టేట్‌బ్యాంకును తీసుకున్నట్లయితే, అంతిమంగా ఆమోదాన్ని తెలిపే అధికారాన్ని తాను వుంచుకుని మిగిలిన రుణ మంజూరు విధానాన్ని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో రిలయెన్స్ ఫైనాన్స్‌కు అప్పచెప్పటం జరిగింది. దీర్ఘకాలంలో పర్మినెంట్ వుద్యోగాలను తగ్గించేందుకు వుద్దేశించిన చర్యయిది.

ఆధారాలు, పనిపరిస్థితులూ మెరుగుపడినా, పెరిగిన ఇంటి ధరలు, ప్రైవేటు రంగంలోని, విద్య వైద్యం, వీరికి కూడా ఈ సౌకర్యాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి; పిల్లలకు ఉద్యోగాలు, కరెంటు రవాణాలాంటి సౌకర్యాలు అందుబాటులో ఉండేట్టు చూసుకోవడంలో పట్టణ మధ్యతరగతి సతమతమవుతున్నారు. భారీ అవినీతి కుంభకోణాలు వీరిలో ఆందోళన కలిగిస్తున్నాయి. యీ చెడుగులన్నీ నయా వుదారవాద విధానాల కారణంగానే వచ్చిన విషయాన్ని వివరించవలసిన అవసరం మన ముందు నిలచివుంది. అందువలన వుదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడవలసిందిగా వారికి నచ్చచెప్పవలసి వుంది.

- **ఐటి రంగం:**

ఐటి, ఐటిఇఎస్‌లలో వుద్యోగుల సంఖ్య పెరిగింది. వీరిలో ఒక చిన్న భాగంగా వున్నవారు మాత్రమే మంచి వేతనాలను పొందుతున్నారు, మిగిలిన వారికి తక్కువ వేతనాలు అందుతున్నాయి. పెద్దమొత్తాలను అందుకుంటున్నారను కుంటున్న వుద్యోగుల వేతనాలు సైతం, అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ

దేశాలలో సరిగ్గా యిలాంటి వుద్యోగాలనే చేస్తున్న వుద్యోగులు అందుకుంటున్న వేతనాలతో పోలిస్తే చాలా తక్కువగా వున్నాయి. ఈ వుద్యోగులు ఎక్కువ గంటలు పనిచేస్తున్నారు. అంతేకాక తమకిచ్చిన లక్ష్యాలను పూర్తిచేసే క్రమంలో తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీనికితోడు తక్కువ వేతనాలను పొందుతున్న వారి నుంచి ఎక్కువ వుత్పాదకతను కోరుతున్నారు. 'రిసోర్సు' అన్న పదాన్ని అటు వుద్యోగులకు, యిటు కంప్యూటర్లకూ వుపయోగిస్తూ, తాము కూడా యీ యంత్రాలలో భాగమేనన్న భావనను వుద్యోగులలో కల్పిస్తున్నారు.

అయితే మొత్తం మీద యీ ఐటి వుద్యోగులు తమను తాము ఇతర సాధారణ వుద్యోగులతో సమానంగా భావించటం లేదు. ఇతరులతో పోల్చుకున్నపుడు తమకు లభించే మెరుగైన వేతనాలు, పనిస్థలంలో వుండే వాతావరణం తదితరాలన్నీ దోపిడీని కప్పివేసి, నయా వుదారవాద ప్రయోజనాలపట్ల వారిలో భ్రమలను కల్పిస్తున్నాయి. కార్మిక సంఘాలుగా తమను తాము సంఘటితం చేసుకోవటంకన్నా వుద్యోగాల మార్పిడి, వైయక్తిక బేరసారాలే లాభకరంగా వారికి కన్పిస్తున్నాయి.

అయితే ప్రస్తుతం పరిస్థితిలో మార్పు వస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా సంక్షోభం ప్రారంభం కావటంతో వారిలో అనేకమంది యిబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ రంగంలో వుద్యోగ అవకాశాలు సన్నగిల్లాయి. సాంకేతిక విజ్ఞాన రంగంలో పునర్వ్యవస్థీకరణ కారణంగా వుద్యోగాలు యితర దేశాలకు తరలుతున్నాయి. అత్యున్నత నైపుణ్యం కలిగిన వుద్యోగాలు అభివృద్ధి చెందిన దేశాలకు తరలిపోగా, తక్కువ నైపుణ్యం కలిగిన వుద్యోగాలు చౌక మార్కెట్లున్న వియత్నాం, ఫిలిప్పైన్స్ తదితర దేశాలకు తరలివెళ్తున్నాయి. గత ఏడాది, అంతకుముందు సంవత్సరాలలో లాభాల రేటు తక్కువగా వున్నందున కొన్ని కంపెనీలలో వేతనాలు పెరుగుదల చాలా తక్కువగా వుండటమో, లేదా నిలిపివేయటమో జరిగింది. ఉద్యోగులలో ఒత్తిడి తేగల శక్తీ, బేరసారాలాడగల సామర్థ్యమూ గణనీయమైన రీతిలో తగ్గిపోయింది. భారతదేశంలోని పెద్ద కంపెనీలు కన్సార్టియంగా ఏర్పడి వుద్యోగులకు సంబంధించిన వివరాలను యిచ్చిపుచ్చుకుంటున్నాయి. దీనివల్ల రానున్న కాలంలో బేరసారాలాడగల వుద్యోగుల వైయక్తిక సామర్థ్యం తగ్గగలదు. ఐటి వుద్యోగులలో అత్యధికులు తమ వుద్యోగాలను నిలుపుకోవటం గురించి ఆలోచిస్తున్నారేగాని, బేరసారాలాడగల సామర్థ్యం గురించి ఆలోచించటం లేదు.

ఐటి రంగంలో పనిచేస్తున్న అధిక భాగం యువ వుద్యోగులు కార్పొరేట్ రంగ ఆధ్వర్యంలో ప్రసారమాధ్యమం చేస్తున్న సంస్కృతి, విలువల ప్రభావం ఎక్కువగా వున్నది. మొత్తంగా చూసినట్లయితే వీరు వామపక్ష సిద్ధాంతం కాలం చెల్లినదిగా భావిస్తున్నారు.

- **మహిళా శ్రామికులు**

శ్రమజీవుల్లో మహిళల భాగస్వామ్యం చెప్పుకోదగిన రీతిలో తగ్గుతున్నది. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలో స్త్రీలకు పనులు వుండటం లేదు, పట్టణ ప్రాంతాలలో చాలినంత పని లభించటం లేదు. ఇళ్ళల్లోనూ, నిర్మాణ రంగంలోనూ వారు ఎక్కువగా పనిచేస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ అంచనా ప్రకారం అన్ని వయసుల వారిలోనూ, వివిధ విద్యాస్థాయిల్లోనూ వున్న శ్రామిక మహిళలు పట్టణ, గ్రామీణ ప్రాంతాల రెండింటా తగ్గుతున్నారు.

దాదాపుగా 96 శాతం మహిళలు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. లక్షలమంది స్త్రీలు వివిధ రకాలైన వుద్యోగాలలో ఇంటివద్ద నుంచే పనిచేస్తున్నారు. స్కీమ్ వర్కర్స్ ('పథక' శ్రామికులలో) ఎక్కువ భాగం స్త్రీలే వున్నారు. వీరికి ఎలాంటి చట్ట సంరక్షణా లేదు. పని స్థలాల్లో మహిళలపై హింస పెరుగుతున్నది. శ్రామికులలో మహిళా శ్రామికులు తగ్గుతున్నప్పటికీ వారు ఎక్కువగా కన్పించటానికి కారణం కార్మిక సంఘ పోరాటాలలో అధికంగా పాల్గొనటమే.

- **యువ కార్మికులు**

ఫాక్స్‌కోన్, నోకియా, మారుతి, హూండయ్, టొయాటొ వంటి ఆధునిక హైటెక్ పరిశ్రమలతో సహా దేశంలోని మొత్తం శ్రమ జీవులలో యువ శ్రామికులే ఎక్కువగా వున్నారు. ప్రైవేటు రంగంలోని యీ హైటెక్ పరిశ్రమలలో తలయెత్తే వుద్యోగ సంబంధాల కారణంగా యువ శ్రామికులే అత్యంత దారుణమైన దోపిడీకి గురవుతున్నారు. ఈ పరిశ్రమలు పెద్ద సంఖ్యలో కాంట్రాక్టు కార్మికులను, అప్రెంటీస్‌లను ట్రైనీలను తదితరులను నియమిస్తున్నాయి. పర్మినెంటు కార్మికులు అతి తక్కువగా వున్నారు. అయితే వీరంతా కీలక బాధ్యతల్లో వున్నారు.

పనిపట్లా, కార్మిక సంఘాలపట్లా వారి వైఖరి, వారి ఆకాంక్షలు, వారి సంస్కృతి, ఖాళీ సమయాన్ని వారు వెచ్చిస్తున్న తీరు, చివరకు వారి భాష వంటివన్నీ గతకాలపు శ్రామికులకు పూర్తిగా భిన్నమైనవి. స్మార్ట్ ఫోన్‌లను,

సామాజిక ప్రసార మాధ్యమాన్ని వినియోగించటం అమితంగా పెరిగిపోయింది.

ఈ యువ వుద్యోగులలో ఒక చిన్న భాగం విద్యాధికులు, సాంకేతిక అర్హతలున్నవారు, ఎగువ తరగతి కుటుంబాల నుంచి వచ్చినవారు. ఉద్యోగ భద్రత గురించి వీరికెలాంటి ఆందోళనా లేదు, సంతృప్తినిచ్చే వుద్యోగాల కోసం వారు నిరంతరం అన్వేషిస్తూ వుంటారు. మధ్యలో వుద్యోగం లేకుండా ఖాళీగా వుండవలసి వచ్చినా వీరేమీ పెద్దగా గాబరా పడరు. ప్రపంచీకరణ కారణంగా తమకు నచ్చిన యుక్తమైన వుద్యోగాలను ఎంపిక చేసుకునే అవకాశాలు వచ్చినట్లు యీ తరగతికి చెందిన పలువురు భావిస్తారు. అయితే అత్యధిక యువజనులు యిలాంటి పరిస్థితిలో లేరు. దిగువ మధ్యతరగతిలోని, పేదకుటుంబాలకు చెంది అత్యుత్తమ విద్యాసంస్థలకు వెళ్ళలేని యువజనులు సంఘటిత రంగంలో తక్కువ వేతనాలతోపాటు, ఎలాంటి సామాజిక భద్రతా ప్రయోజనాలు లేని వుద్యోగాలలో చేరుతున్నారు. దేశంలోని మొత్తం శ్రామికులలో 94 శాతం మంది అసంఘటిత రంగంలోనే వున్నారు. అత్యధిక యువజనులు సైతం అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు.

ఉన్నత విద్యను అభ్యసించి, సాంకేతిక విజ్ఞానంలో అర్హతలను సంపాదించి, ఆధునిక హైటెక్ పరిశ్రమలలో వుద్యోగం చేస్తూ, వున్నంతలో మెరుగైన వేతనాన్ని పొందేవారు కార్మిక సంఘాలలో చేరేందుకు, పోరాటాలలో పాల్గొనేందుకు ఆసక్తి చూపరన్న సాధారణ అభిప్రాయం ఒకటి వున్నది. కొంతమేరకు యిది నిజమేకావచ్చు. ఎందుకంటే, వుమ్మడి కార్యాచరణను పక్కకునెట్టి, వ్యక్తివాదాన్ని పెంచిన నయా వుదారవాద సంస్కృతి ప్రభావం యువజనులపై వున్నది. అయితే, యిదే సమయంలో, బహుళజాతి సంస్థలకు చెందిన వస్తుతయారీ యూనిట్లతో సహా అనేక ఫ్యాక్టరీలలో తాము అన్యాయమనుకున్న యాజమాన్యం యొక్క చర్యలపట్ల తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ యువ శ్రామికులు మెరుపు సమ్మెలకు దిగిన వుదాహరణలు అనేకం వున్నాయి. మారుతి సుజికి, హుూండయ్, నోకియా, ఫోక్స్‌కాన్ తదితరాలలో తమ డిమాండ్ల కోసం పోరాటాలలో పాల్గొని చివరకు అణచివేతలను సైతం ఎదుర్కొన్న వుదాహరణలు అనేకం వున్నాయి. ఎన్నో ఆశలతో వుద్యోగంలో చేరినవారు, పనిస్థలంలో యాజమాన్యం తమపట్ల ప్రవర్తించే తీరు కారణంగా త్వరలోనే భ్రమలు తొలగించుకుని తమపై వివక్షాపూరితమైన సంబంధాలను రుద్దుతుండటం పట్ల తరచుగా తీవ్రమైన రీతిలో నిరసన తెలపటం కన్పిస్తుంది.

దేశంలోని పలు ప్రాంతాల్లో వున్న యీ పరిశ్రమల్లో సంభవించిన అనేక మెరుపు పోరాటాల్లోనూ, అలజడుల్లోనూ యీ పరిస్థితి ప్రతిబింబిస్తున్నది.

ఏవో కొన్నిచోట్ల మినహాయిస్తే మన కార్మిక సంఘాలు యిప్పటివరకు వీరికి చేరువై యింకా సంఘటితపరచలేదు. కార్మిక సంఘాల పనివిధానానికి సంబంధించిన పాతపద్ధతులతో వారిని చేరలేము. ఈ వుద్యోగులను సంఘటిత పరచాలని భావించినపుడు, వర్గ దృక్పథాన్ని విడవకుండానే పని విధానానికీ, భాషా వినియోగానికీ సంబంధించి తగిన పద్ధతులను రూపొందించటానికి కార్మిక సంఘాల నిర్వాహకులు మేధోపరంగా, రాజకీయంగా, నిర్మాణరీత్యా తమను తాము సన్నద్ధం చేసుకోవాలి. ఇందుకుగాను యువ కేడర్ అవసరం చాలా వున్నది. మనం జోక్యం చేసుకోనట్లయితే యీ యువ శ్రామికులు వివిధ రకాలైన అభివృద్ధి నిరోధక, తిరోగమన భావాలచే ప్రభావితం కాగలరు.

◆ ***యూనియనైజేషన్***

కార్మికులను సంఘటితపరచడం, ప్రత్యేకించి ప్రైవేటురంగ పరిశ్రమల్లోని వారిని సంఘటితపరచడం అనేది నయా వుదారవాద శకంలో కార్మిక సంఘాలకు పెనుసవాలుగా మారింది. కార్మిక సంఘాలను నమోదు చేయించటం కూడా కష్టంగా మారింది. శ్రామికులు యూనియన్లలో చేరకుండా నిరోధించేటందుకై ప్రధానంగా ఉన్న వారిని బలిపశువులను చేయడం, సందర్భాన్నిబట్టి ప్రలోభపెట్టటం వంటి ఎత్తుగడలను యాజమాన్యం అనుసరిస్తున్నది. రాష్ట్ర కార్మిక పర్యవేక్షణ యంత్రాంగాన్ని ప్రభుత్వమే బుద్ధిపూర్వకంగా బలహీన పరుస్తున్నది. సంఘటిత రంగంలో మూడింట ఒకవంతు కార్మికులు మాత్రమే తమ పనిస్థలంలో వున్న కార్మిక సంఘంలో చేరుతున్నట్లు వెల్లడైంది. 2004-05లో మొత్తం కార్మికుల్లోని 36.2శాతానికి మాత్రమే తమ పని స్థలంలోని యూనియన్ గురించి తెలుసు. 2011-12 నాటికి యీ సంఖ్య 31.5 శాతానికి తగ్గింది. 2011-12లోనే పర్మినెంటు కార్మికుల్లో సైతం 34.5 శాతం మందికి మాత్రమే తమ పనిస్థలంలోని యూనియన్ గురించి తెలుసు. తమ పనిస్థలంలోని యూనియన్ గురించి తెలిసిన కార్మికుల్లో కేవలం 76 శాతం మంది మాత్రమే ఏదో ఒక యూనియన్లో సభ్యులుగా వున్నారు. 2011-12లో యీ సంఖ్య 66.3 శాతానికి తగ్గిపోయింది.

కొంతమంది కార్మిక సంఘ నాయకుల్లో సైతం నయా వుదారవాద విధానాలు

భ్రమలను సృష్టించి, వారిలో అవకాశవాద ధోరణులను పెంచుతున్నాయి. వామపక్షాల నాయకత్వంలోని కార్మిక సంఘాల నాయకుల్లో ఒక భాగం కూడా నయా వుదారవాద విధానాల సానుకూల ప్రభావంపట్ల నమ్మకాన్ని కలిగి వున్నారు. దీనివల్ల చొరవను కోల్పోవటం, అలసత్వం, కొన్ని సమయాలలో పరిశ్రమ స్థాయిలో సకాలంలో జోక్యం చేసుకోవటంలో వైఫల్యం సంభవిస్తున్నాయి. సమర్థవంతమైన పోరాటాలకు కార్మిక వర్గాన్ని సైద్ధాంతికంగా సన్నద్ధం చేయడంలో పార్టీ, దాని నాయకత్వంలోని కార్మిక సంఘాలు చూపుతున్న చొరవ ఎంతమాత్రం సరిపోదు.

15. ఈ దశలో కార్మిక సంఘాల వుమ్మడి పోరాటాలలో కొంత పురోగతి వున్నది. గత ఐదేళ్ళ కాలంలో ఐఎన్‌టియుసి, బిఎంఎస్ వంటి కేంద్ర కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలతోపాటు, సంయుక్త ప్రచారాందోళనలు, పోరాటాలను సాగించాయి. కాగా యిప్పుడు పెట్టుబడుల వుపసంహరణ, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వగైరా వంటి విధానపరమైన విషయాలతో సహా యితర డిమాండ్ల కోసం పదకొండు కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్త ఆందోళనలను నిర్వహిస్తున్నాయి.

16. నయా వుదారవాద ప్రపంచీకరణ కింద కార్మిక వర్గంలోని విభిన్న విభాగాల పరిస్థితులకు సంబంధించి పైన పేర్కొన్న వివరాలు తెలుపుతున్నదేమంటే, పెట్టుబడి నియంతృత్వం యొక్క నిర్దిష్ట రూపాలు యీ విభిన్న విభాగాలలో వేర్వేరుగా వ్యక్తమవుతున్నాయి. ప్రధానమైన రెండు ధోరణులు మాత్రం దాదాపు సార్వత్రికమైనవని స్పష్టంగా తెలుస్తున్నది. పని సమయాల పెరుగుదలా, పని ఒత్తిడీ సార్వత్రికంగా కనపడుతున్నది. దీనికితోడు మధ్యతరగతి వుద్యోగులలో కొంతమందికి వేతనాలు గణనీయంగా పెరగగా, అత్యధిక సంఖ్యాకులైన కార్మికుల వేతనాలు కుదించుకుపోవటం, స్తంభించటం జరుగుతున్నది. భారతదేశంలోని సంఘటిత ఫ్యాక్టరీ రంగంలో కార్మికుని తలసరి సగటు వేతనం గత రెండు దశాబ్దాల కాలంలో పెరగలేదన్నది వాస్తవం. నిజానికి 1990ల ప్రారంభ స్థాయికన్నా తక్కువగా వున్నది. ఈ స్థాయికూడా 'ఎక్కువని' భావించనవసరం లేదు. ఇది 2011-12లో ఒక నెలకు ఒక కార్మికునికి రూ. 8,000లుగా వున్నది. కార్పొరేట్ రంగంలోని ఫ్యాక్టరీలలో (ప్రభుత్వ రంగంతోసహా) యీ సగటు దాదాపు రూ. 10,000లుగా వుండగా, భాగస్వామ్య ఫ్యాక్టరీలలో, లేదా యాజమాన్య సంస్థలలో రూ. 4000లుగా వున్నది.

గుర్తింపులేని సంస్థలలో వేతన కార్మికులకు సగటున రూ. 4,000కన్నా తక్కువే వస్తున్నది.

వేతనాల కుదింపు, అనియత వుద్యోగిత, ఇలాంటి వుద్యోగాల కోసం తరచుగా ప్రాంతాలు మారవలసిన అవసరం, ప్రభుత్వం అందచేసే సామాజిక సేవలలో కోతలు లేదా ఆంక్షల కారణంగా కార్మికవర్గ కుటుంబాలు నిలదొక్కుకోవటం కష్టమవుతున్నది. ఈ కారణంగా ఖర్చుల పెరుగుదలతోపాటు, వేతనాలు తక్కువ కావటంతో కార్మికవర్గ కుటుంబాలకు అదనపు ఆదాయం అవసరమవుతున్నది. ఇందుకుగాను, కుటుంబంలోని మహిళలు ప్రతిఫలరహితమైన పనిచేయటంతోపాటు యితర మార్గాలను కూడా అన్వేషించవలసి వుంటున్నది. ఈ విధంగా, వుత్పత్తిలో వేతన వుపాధికి వెలుపల వున్న అన్ని రకాల పనులు, జీవనోపాధి సమస్యలు, సామాజిక సేవలు మొత్తంగా కార్మిక కుటుంబాలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కార్మిక వర్గంలోని విభిన్న విభాగాలను సంఘటితం చేస్తూనే యీ సమస్యలన్నిటినీ మన కార్మిక సంఘాలు పట్టించుకోవలసి వుంటుంది.

## *17. కార్మికవర్గ దృక్పథంలో మార్పులు*

కార్మిక వర్గం ఎదుర్కొంటున్న యీ పరిస్థితులు అనేక అభివృద్ధి నిరోధక భావాలు, సాంస్కృతిక ధోరణులు పెరగటానికి అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయి, అంతేకాక వారి ఆలోచనల్లో యిమిడివున్న యీ తరహా భావనలను పటిష్టపరచటానికి దోహదపడుతున్నాయి. ఈ రకమైన అభివృద్ధి నిరోధక భావజాలాన్నీ, సాంస్కృతిక ధోరణులనూ కార్పొరేట్ ప్రసార మాధ్యమం పెంచిపోషిస్తున్నది. కార్మిక వర్గంలోని అత్యధిక భాగాన్ని ప్రభావితం చేస్తున్నది. చెదురుమదురుగా కనిపించే వైయక్తిక విజయాలను ప్రసారమాధ్యమం వుద్దేశపూర్వకంగా ఆకాశానికి ఎత్తుతూ ఉమ్మడి ప్రయత్నాలను, ప్రత్యేకించి యూనియన్ల ద్వారా జరిగిన ప్రయత్నాలను పక్కకు నెట్టివేస్తున్నది. కార్మికవర్గంలోని కొన్ని తరగతులలో యిది భ్రమలను సృష్టించగలుగుతున్నది. మరీ ముఖ్యంగా విద్యాధిక, యువజనులపైనా ప్రభావాన్ని చూపుతున్నది. వీరికి వ్యక్తిగత ప్రయత్నాలపట్ల విశ్వాసం ఎక్కువ; కార్మిక సంఘాల కార్యకలాపాలలో క్రియాశీలంగా పనిచేయటంపట్ల ఆసక్తి వుండదు. మంచి వేతనాలు పొందే సంఘటిత రంగ వుద్యోగులు విరామ సమయాన్ని గడపటంలోనూ, వినియోగంలోనూ మార్పు వచ్చింది. కుల, మత ప్రభావాలూ,

వాటి పేరుతో పుట్టుకు వచ్చే సంస్థలూ కార్మిక వర్గంపై ప్రభావాన్ని చూపుతున్నాయి. అంతేకాక వర్గ ప్రాతిపదికపై ఏర్పడే ఐక్యతను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ద్రవ్యరంగ వుద్యోగుల వంటి మధ్య తరగతి వుద్యోగుల్లో కొంత భాగం తమను నేరుగా దెబ్బతీసే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో పాల్గొంటున్నప్పటికీ, నయా వుదారవాద విధానాల కారణంగాపడే మొత్తం ప్రభావాన్ని అవగాహన చేసుకోవటానికి ఆసక్తి చూపటం లేదు.

18. ప్రగతిశీల కార్మికవర్గ వుద్యమం తప్పనిసరిగా పరివ్యాప్తిలో వున్న యిలాంటి ధోరణుల నుంచి పుట్టుకువచ్చే సవాళ్ళను ఎదుర్కొనవలసి వస్తుంది. ఏదియేమైనప్పటికీ, బలమైన కార్మికవర్గ నిర్మాణమే యిలాంటి ధోరణులను సమర్ధవంతంగా ఎదుర్కొనగలదన్న విషయాన్ని యీ సందర్భంగా గమనంలో వుంచుకోవాలి. ఇలాంటి వుద్యమానికి ప్రాతిపదిక సరిగ్గా ఆ పరిస్థితుల్లోనే వుంటుంది. కార్మికవర్గ ఆలోచనల్లో కదలే భావాలు ఏమైనప్పటికీ వున్న యదార్థమేమంటే, కార్మిక వర్గంపై అణచివేత, దోపిడీ తీవ్రతరం కావటం, వీటితోపాటే వునికి కోసం అవిరామ పోరాటం. ఒకవేళ పరిస్థితులు కార్మికవర్గం లోపల ఆకాంక్షలను పెంచినప్పటికీ, ఆ ఆకాంక్షలను తీర్చుకునే శక్తికి ఆ పరిస్థితులే అడ్డంకులవుతాయి. ఈ వైరుధ్యాల అర్థం ఏమంటే, పెట్టుబడి నిరంకుశత్వం సృష్టించే పరిస్థితులపట్ల కార్మిక వర్గంలో శత్రుత్వం పెరగటం. అయితే, యీ శత్రుత్వాన్ని పెట్టుబడి నిరంకుశత్వం కొంతకాలంపాటు అణచి వేయగలదు. తనను తాను అతిగా ప్రదర్శించటం ద్వారా లేదా కార్మికులలోని భావావేశాలను పక్కదారి పట్టించడం ద్వారా అది యీ పనిచేస్తుంది. ఏదియేమైనప్పటికీ యీ క్రమంలోనే వర్గ అణచివేత, దానితోపాటే వర్గ ఐక్యత, ప్రతిఘటనల పెరుగుదలకు పునాది ఏర్పడుతుంది. ఈ అభిప్రాయాలను, భావాలను బహిర్గతం చేసి, పెట్టుబడి దాడులకు వ్యతిరేకంగా సమర్ధవంతమైన పోరాటాల వైపుకు మళ్ళించాలి. ఇక్కడ ప్రధానమైన విషయమేమంటే, యీ సందర్భంగా ద్విముఖ దృక్పథాన్ని కలిగి వుండాలి. అదేవిధంగా, నయా వుదారవాదం అనేది కేవలం కార్మికవర్గ వుద్యమాభివృద్ధికి పెద్దయెత్తున ఆటంకాలను కల్గించటమే కాకుండా దాని సంభావ్యతకు కూడా అవకాశం యిస్తుంది.

భారతీయ కార్మిక వర్గంలో బ్రహ్మాండమైన వైవిధ్యం వున్నదని, యీ వైవిధ్యం తాత్కాలికమైనదికాక, భారతీయ పెట్టుబడిదారీ వ్యవస్థలో యిదొక అంతర్గత

లక్షణమని గుర్తించాలి. కార్మికవర్గంలోని వివిధ విభాగాల తేడాపాడాలను దృష్టిలో వుంచుకున్నపుడు విప్లవాత్మకమైన కార్మికవర్గ చైతన్యం యొక్క స్వతంత్ర అభివృద్ధి అన్ని విభాగాలలోనూ ఒకే రకంగా వుండదని కచ్చితంగా చెప్పవచ్చు. వేర్వేరు కారణాలరీత్యా యీ రకమైన చైతన్యం యొక్క సంపూర్ణాభివృద్ధి ఐటి శ్రామికుల విషయంలోనూ, అలానే పారిశ్రామిక కార్మిక వర్గంతో పోల్చినపుడు స్థిరమైన ప్రాంతంగానీ, లేదా స్థిరమైన యజమానిగానీ లేని దినసరి కూలీల విషయంలోనూ చాలా క్లిష్టంగా వుంటుంది. దీని అర్థమేమిటంటే, ఐక్య కార్మికవర్గ వుద్యమాభివృద్ధికి, పారిశ్రామిక కార్మికుల సంఖ్య మొత్తం కార్మికవర్గంలో తక్కువగా ఉండవచ్చు. తగ్గుతూ ఉండవచ్చుకూడా. అయినా దాని ప్రభావం కార్మిక వర్గం అంతటిమీద ఎంతో ఎక్కువగా ఉంటుంది.

పారిశ్రామిక కార్మికవర్గం అత్యధిక వుత్పాదకతను కలిగి వున్నప్పటికీ, అసంఘటిత రంగంలోని తమతోటి వారితో పోల్చుకుంటే ఎక్కువ వేతనాలను పొందుతున్నప్పటికీ అధికస్థాయిలో దోపిడీకి గురవుతున్నది. ఉత్పత్తి రంగంలో యంత్రాల పెరుగుదల వల్ల కలిగే ప్రత్యక్ష ప్రభావాన్ని వారు చవిచూస్తున్నారు. యంత్రాల కారణంగా కార్మికుల సంఖ్య తగ్గుతున్నది. కార్మిక వర్గంలోని యీ భాగం యిదే సమయంలో తమ దృష్టిని యితర మార్గాల వైపుకు మళ్ళిస్తున్నారు. వీరిలో 70 శాతం మంది కార్పొరేట్ సంస్థలకు చెందిన ఫ్యాక్టరీలలో పనిచేస్తున్నారు. అంటే, ఒకే ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కేంద్రీకృత బృందాలుగా వారు బయటకు వెళ్ళవలసి రావటమేకాదు, అలాంటి ప్రతి కేంద్రీకృత బృందమూ పెట్టుబడి సృష్టించిన అతిపెద్ద కేంద్రీకృత కార్మిక సమూహంలో భాగంగా వుంటుంది. పలు కంపెనీలు అనేక ఫ్యాక్టరీలను కలిగి వున్నాయి. భారతదేశంలోని బడా పెట్టుబడిదారులు సైతం ఒకే సమయంలో అనేక కంపెనీలను (బిజినెస్ గ్రూపు) నడుపుతున్నారు. ఇవి అంతకంతకు పెరుగుతున్నాయి, యివికాక పారిశ్రామికేతర కార్యకలాపాలను నిర్వహించేవి కూడా వున్నాయి. వీటితోపాటు భారతదేశంలోకి బహుళజాతి సంస్థలు కూడా అడుగుపెట్టాయి, పలు భారతీయ వాణిజ్య బృందాల అంతర్జాతీయాకరణ చెందాయి, ప్రపంచ వుత్పత్తి వ్యవస్థలోకి భారతీయ కంపెనీలు చేరడమేకాక, యీ శ్రామికులు అతిపెద్ద కేంద్రీకృత బృందాల్లో భాగంగా మారి దేశ సరిహద్దులను దాటి విస్తరించారు. 2008 సంక్షోభం నుండి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ తేరుకున్న జాడలేమీ కన్పించటం లేదు. భారతీయ పెట్టుబడిదారీ

వ్యవస్థ తొలిదశలో యీ తుఫాన్‌ను తట్టుకున్నట్లు కన్పించినప్పటికీ తరువాత పురోగతి, సంచయనం మందగించిన దశలోకి ప్రవేశించింది, లాభాల పెరుగుదల కూడా తగ్గుముఖం పట్టింది. స్థూల ఆర్థిక స్థాయిలో, సంక్షోభం అంటే పెట్టుబడిని, అదేవిధంగా కార్మిక జనుల యొక్క వైరుధ్యభరితమైన ప్రయోజనాలను ద్రవ్య విధానంలో సర్దుబాటు చేయటం అసాధ్యంగా వుంటుంది, కనుక కార్మికుల విషయానికి వస్తే పరివ్యాప్తిలో వున్న పరిస్థితుల వలన వారికి ప్రమాదం ఎక్కువగా వుంటుంది. ఇదే సమయంలో మహత్తర 'సంస్కరణల' కోసం, అదేవిధంగా ప్రైవేటు పెట్టుబడిదారుల, విదేశీ పెట్టుబడుల 'దృక్పథాన్ని' మెరుగుపరచాలన్న తహతహ ఎక్కువవుతుంది. ఈ సంక్షోభం ప్రధానంగా పారిశ్రామిక (వస్తుతయారీ) రంగాన్ని దారుణంగా దెబ్బతీసింది. అయితే కార్మిక వర్గాన్ని బలిపెట్టి దీనినుంచి బయట పడాలని పెట్టుబడిదారులు భావిస్తున్నారు. చివరకు అత్యధిక కార్మికులు తమ దృష్టిని సారిస్తున్న నిర్మాణరంగం సైతం కష్టాలను ఎదుర్కొంటున్నది. కనుక రానున్న రోజులలో పెట్టుబడికీ, శ్రమశక్తికీ మధ్య వైరుధ్యం మరింత తీవ్రతరం కాగలదని మాత్రమే మనం అంచనా వేయగలం. యిటు వుత్పత్తి సంస్థలలోనూ, అటు సమాజంలోనూ ప్రత్యేకించి ఆర్థిక విధానాల సమస్యపై యీ వైరుధ్యం వుంటుంది. ఉనికిలో వున్న శక్తి సామర్థ్యాలను సమర్థవంతంగా వుపయోగించు కోవటం ద్వారా, నయా వుదారవాద వ్యతిరేక పోరాటాన్ని బలోపేతం చేయటం ద్వారా కార్మిక వర్గాన్ని సంఘటితం చేయటంలో తన నేతృత్వంలోని కార్మిక సంఘాలకు మార్గ నిర్ధేశనం చేసేందుకై తగిన వ్యూహాన్ని పార్టీ రూపొందించు కోవాలి.

### *19.* **సలహాలు**

* నయా వుదారవాద విధానాల దుష్ప్రభావాన్ని గురించిన సైద్ధాంతిక బోధన, మన కేడర్‌లో వాటికి వ్యతిరేకంగా శక్తివంతమైన పోరాటాలను అభివృద్ధి చేయవలసిన అవసరం.
* ప్రైవేటు సంఘటిత రంగంతో సహా వ్యూహాత్మకమూ, కీలకమూ అయిన పరిశ్రమలపై ప్రత్యేక దృష్టిని సారించడం.
* సంయుక్త కార్మిక సంఘాల ప్రచారాందోళనలూ, పోరాటాలూ కార్మిక వర్గంలో పార్టీ పలుకుబడి విస్తరణకు దారితీసే విధంగా వుండేలా పార్టీ నేతృత్వంలోని కార్మిక సంఘాలకు మార్గనిర్దేశనం చేయటం.

* పార్టీ నాయకత్వంలోని కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల సంయుక్త పోరాటాలను అభివృద్ధి చేయటం.

* పనిస్థలంలోని అంశాలతోపాటు కార్మికులకు సంబంధించిన యితర అంశాలను అంటే, ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణం, వారి నివాస ప్రాంతాలలో పౌరసదుపాయాలు వంటి విషయాలను కూడా మన నాయకత్వంలోని కార్మిక సంఘాలు పట్టించుకోవాలి.

* యువ శ్రామికుల పట్ల ప్రత్యేక శ్రద్ధ.

* ప్రచారాలలో ప్రజా సంస్కృతిని వినియోగించుకోవటం.

# అనుబంధం

***భారతదేశంలో కార్మిక వర్గం: గణాంకాల నుండి:***

ఎన్ఎస్ఎస్ 68వ దఫా (2011-12) ప్రకారం భారతదేశపు శ్రమశక్తి [సాధారణ స్థాయి (పిఎస్+ఎస్ఎస్)] 48.40 కోట్లు, శ్రామిక ప్రజలు 47.30 కోట్లు వుంటారు. శ్రమించే వయసులో వున్నవారు 75 కోట్లమంది వుంటారు. శ్రామికులలో 61 శాతం వ్యవసాయ కార్యకలాపాలలో నిమగ్నమై వున్న 1990ల ప్రారంభంతో పోల్చితే వారి దామాషా 2011-12లో సగానికి పడిపోయింది (*జనాభా లెక్కల ప్రకారం వ్యవసాయంలో పనిచేసేవారి సంఖ్య కాస్త తక్కువగా కాస్త ఎక్కువగా వున్నప్పటికీ, వారి సంఖ్య క్షీణిస్తున్నట్లు అవే లెక్కలు తెలుపుతున్నాయి. 2001-2011 మధ్య సాగుదారుల, రైతుల సంఖ్య 90 లక్షలకు తగ్గింది)* వ్యవసాయేతర కార్యకలాపాలలో దాదాపుగా 24.20 కోట్లమంది (11.50 కోట్లమంది పారిశ్రామిక అనుబంధ రంగంలోనూ, 12.70 కోట్ల మంది లేదా సేవారంగంలో) పనిచేస్తున్నారు. పారిశ్రామిక రంగానికి చెందిన వారిలో దాదాపు 5 కోట్ల మంది, అంటే మొత్తం శ్రామికులలో 11 శాతం మంది ఒక్క నిర్మాణ రంగంలోనే పనిచేస్తున్నారు. 1990లలో నిర్మాణ రంగంలో పనిచేస్తున్న వారు 4 శాతంకన్నా తక్కువగా వున్నారు. కాగా, యిప్పుడు యీ రంగంలో వస్తుతయారీ రంగంలో వున్నవారితో సంఖ్యరీత్యా పోటీపడుతున్నారు. అనియతి రంగంలో కనీసంగా 1.60 కోట్ల నుంచి 1.70 కోట్లమంది నిర్మాణరంగ కార్మికులు వున్నారు. వస్తుతయారీ రంగంలోని శ్రామికులకన్నా వీరు ఎక్కువ. శ్రామిక జనులలో దాదాపు 8.50 కోట్లమంది రెగ్యులర్ వేతనాలను అందుకుంటున్న వారుకాగా, 14.10 కోట్లకు పైన దినసరి వేతన శ్రామికులుగా వున్నారు. (వీరు వుభయులు కలసి 22.60 కోట్లమంది వుండి దాదాపుగా స్వయం వుపాధి కలిగివున్న 24.70 కోట్లమందికి

సమానంగా వున్నారు) వీరిలో రెగ్యులర్ వేతనాలు తీసుకునే వారు, డిజిఇటి సమాచారం ప్రకారం 2.95 కోట్లమంది సంఘటితరంగంలో పనిచేస్తున్నారు. 1991తో పోల్చుకుంటే (2.70కోట్లు) యీ సంఖ్యలో పెద్దగా తేడాలేదు.

వుద్యోగాలకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటురంగాల వాటాలలో తేడాలు వున్నాయి. ప్రభుత్వ రంగంలో వుద్యోగాలు తగ్గుముఖం పట్టాయి. 1991లో 2 కోట్లుగా వున్నవల్లా 2012 నాటికి 1.76 కోట్లకు తగ్గాయి. అదే కాలంలో ప్రైవేటు సంఘటిత రంగంలో ఉద్యోగాలు 80 లక్షలనుండి 1కోటి ఇరవైలక్షలకు పెరిగాయి. ప్రభుత్వరంగంలోని వస్తుతయారీ రంగంలో ఈ తగ్గుదల ఎక్కువగా వున్నది. 18.50 కోట్ల నుంచి 10.70 కోట్లు తగ్గింది. మరోవైపున ప్రైవేటు సంఘటిత రంగంలోని వుద్యోగాల పెరుగుదలను వస్తు తయారీయేతర కార్యకలాపాలలోనే అత్యధికంగా, అలాగే 1992-2012 మధ్య మొత్తంగా పెరిగిన 4 లక్షల ఉద్యోగాలలో వస్తూత్పత్తి రంగంలో పెరిగినది పదిలక్షలే. డిజిఇటి సమాచారం కేవలం వేతన వుద్యోగులనే కాకుండా వేతన ఆదాయపరులైన వున్నతాధికారులను కూడా చేర్చింది; మరోవైపున సంఘటిత రంగంలోని మొత్తం వుద్యోగాలను పరిగణనలోకి తీసుకోలేదు. అంతేకాక నిర్మాణ రంగంలోని వుద్యోగులను తక్కువగా అంచనా వేసింది, అలానే 'రోజువారీ వేతన శ్రామికుల' పెరుగుదలను కూడా పట్టించుకోలేదు. ఆవిధంగా 10 లక్షలమందికన్నా తక్కువగా వున్న నిర్మాణరంగ వుద్యోగులతో సహా సంఘటిత రంగంలో పనిచేస్తున్న వారు 2.95 కోట్లమంది కాగా, యివే పనులలో పాల్గొనే వారి సంఖ్యను 1.50 కోట్లుగా ఎన్ఎస్ఎస్ పేర్కొన్నది (ఈ వుద్యోగాలు స్వభావరీత్యా తాత్కాలికమైనవే అయినప్పటికీ యజమాని మాత్రం సంఘటిత రంగానికి చెందిన వ్యక్తి). ఇదేవిధంగా 2012లో 66లక్షలుగా పేర్కొన్న డిజిఇటి సంఖ్యతో పోల్చుకుంటే, ఏఎస్ఐ సమాచారం ప్రకారం సంఘటిత రంగ ఫ్యాక్టరీలలో 1.34 కోట్లమంది పనిచేస్తున్నారు, వీరిలో 1.04 కోట్లమందిని శ్రామికులుగా వర్గీకరించటం జరిగింది.

నిర్మాణరంగం కాకుండా యితర వ్యవసాయేతర వైయక్తిక పరిశ్రమలలో 67వ ఎన్ఎస్ఎస్ఓ (2010-11) ప్రకారం 2.70 కోట్లమంది వేతన శ్రామికులుండగా, వీరిలో వస్తుతయారీ (1.04 కోట్లు), చేతివృత్తులు (60 లక్షలు), యితర రంగాలలో (1.06 కోట్లమంది) పనిచేసే వారున్నారు. 2011-12లో (68వ ఎన్ఎస్ఎస్ఓ) పర్మినెంట్ వుద్యోగుల రోజువారి వేతనం

రూ. 396లు కాగా, తాత్కాలిక శ్రామికుని దినసరి వేతనం రూ. 170లు లేదా రూ. 139లు (పట్టణ, గ్రామీణ). 2010-11లో (67వ ఎన్ఎస్ఎస్ఓ) వేతన శ్రామికుల సగటు ప్రతిఫలం నెలకు రూ. 4,000లుగా వున్నది. సంఘటిత ఫ్యాక్టరీ రంగంలో 2011-12లో కార్మికుని నెలసరి సగటు వేతనం కాస్త తక్కువగా రూ. 8000లుగా (ఏఎస్ఐ) వున్నది. ప్రభుత్వరంగ ఫ్యాక్టరీలలో యిది రూ. 11,000లుగా (ఫ్యాక్టరీ కార్మికులలో 30 శాతం) వున్నది. ప్రైవేటు రంగ కంపెనీలలో యిది రూ. 7,300 వరకు వున్నది (ఫ్యాక్టరీ కార్మికులలో 38 శాతం), యజమాన్య-భాగస్వామ్య సంస్థలలో (ఫ్యాక్టరీ కార్మికులలో 28 శాతం) రూ4,000 నుంచి రూ. 5,000 మధ్య వుంటుంది.

పైన ప్రస్తావించిన ఫ్యాక్టరీ శ్రామికుల నిజ వేతనాలు వాస్తవానికి రెండు దశాబ్దాలపాటు యథాతథంగా వుండిపోయాయి. ఇది నిజ ఆదాయాల ప్రతిష్టంభననే కాకుండా ప్రతి పని దినం యొక్క చేసిన నిజవేతనాన్ని ప్రతిబింబిస్తున్నది.

ఏదియేమైనప్పటికీ, ఫ్యాక్టరీలలో కార్మికేతర వుద్యోగులకు చెల్లించే వేతనాలలో కొద్దిపాటి మెరుగైన ధోరణి కన్పిస్తుంది.మొత్తం వుద్యోగులలో కార్మికుల వాటా 1990-91 నుంచి 2011-12 మధ్య 76 నుంచి78 శాతం పెరగగా ఇదే కాలంలో మొత్తం వుద్యోగులకు చేసే వేతనాల చెల్లింపులో కార్మికుల వాటా 64 నుంచి 50 శాతానికి తగ్గింది.

వేతన స్తంభనతోపాటు వుత్పాదకత పెరుగుదల, విలువ జోడించిన వేతన భాగం తీవ్రంగా కుదించబడటానికి దారితీసింది (దోపిడీ రేటు పెరుగుదలకు సూచిక)

వేతన వాటాలో క్షీణ ధోరణి కేవలం వస్తుతయారీ రంగానికి మాత్రమే పరిమితం కాలేదు, నిర్మాణ రంగం, సేవలతో సహా సమస్త కార్యకలాపాలకు, ప్రత్యేకించి ప్రైవేటు సంఘటిత రంగానికీ వర్తించింది (సిఎస్ఓ, నేషనల్ అకౌంట్స్ స్టాటస్టిక్స్). ప్రైవేటు సంఘటిత రంగం మొత్తంగా విలువ జోడించిన విధానాన్ని తీసుకున్నట్లయితే (ప్రధానంగా వస్తుతయారీయేతర కార్యకలాపాల నుంచి వస్తున్నది) వుద్యోగుల పరిహార చెల్లింపుల వాటా (సిఓఇ)1990-91లో 55 శాతంగా వున్నదల్లా ప్రస్తుతం 30 శాతానికి పడిపోయింది. గత రెండు దశాబ్దాల కాలంలో కొంతమంది వుద్యోగుల వేతనాలు బాగా పెరిగినప్పటికీ యీ పరిణామం సంభవించింది. (విప్రో సంస్థకు చెందిన 103 మంది

అత్యున్నతస్థాయి అధికారుల నెలసరి సగటు వేతనం 2011-12లో రూ.8 లక్షలుగా వున్నది, అంటే, నెలకు గరిష్ట వేతనం రూ.42 లక్షలు కాగా, కనీస వేతనం రూ.5 లక్షలుగా వున్నది).

గమనించదగిన మరో ధోరణి ఏమిటంటే సంఘటిత వస్తుతయారీ రంగం అంతకంతకూ గ్రామాలలో విస్తరిస్తున్నది. 2011-12లో గ్రామప్రాంతాలలోని ఫ్యాక్టరీలు, పట్టణ ప్రాంతంలోని వాటికన్నా పెద్దవి, మరింత ఎక్కువగా యాంత్రీకరించబడినవి మరింత వుత్పాదకతను కలిగినవి; వుద్యోగులలో 44 శాతం, స్థిర పెట్టుబడిలో 56 శాతం, ఫ్యాక్టరీ నికర విలువలో జోడించడంలో 53 శాతాన్ని కలిగి వున్నాయి. ఒక్కొక్క ఫ్యాక్టరీలో పనిచేసే సగటు కార్మికులు పట్టణ కార్మికుల్లోకన్నా (43) గ్రామాలలోనే (56) ఎక్కువ. అయితే గ్రామీణ ఫ్యాక్టరీలలో సగటు వేతనం తక్కువగా (పట్టణ ఫ్యాక్టరీలలో నెలకు రూ.8500లు వుండగా గ్రామీణ ప్రాంతంలో రూ.7200లు) వున్నది. నికర విలువ జోడింపు మొత్తంలో వేతనాల వాటా కూడా తక్కువగానే (పట్టణ ప్రాంతాలలో 15.41 శాతంకాగా గ్రామీణ ప్రాంతాలలో 8.85 శాతం) వున్నది.

**అధ్యయన బృందం సభ్యులు**

కె. హేమలత (కన్వీనర్)

ఎలమారన్ కరీం

సురజిత్ మజుందార్

వివేక్ మోంటిరియో

ప్రబీర్ పురకాయస్థ

వేణుగోపాల రావు.


ప్రతులు : 2000

ప్రచురణ కాలం : జనవరి, 2018

వెల : ₹ 15/-

132434

**ప్రచురణ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), ఆంధ్రప్రదేశ్ కమిటీ**

*27-13-3, సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, ఆకుల వారి వీధి,*

*గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ నెం. 0866 2577202, 9490098042*